ఈనాడు
నాగర్‌కర్నూల్
గురువారం అక్టోబరు 10, 2024



చిన్న చేపలే లక్ష్యంగా మంచాలకట్ట సమీపంలోని కృష్ణా నదిలో నిషేధిత వలతో వేటాడుతున్న మత్స్యకారులు

అలివిమాలిన వేట

- కృష్ణా తీరంలో నిషేధిత వలలతో ఇతర ప్రాంతాల జాలర్లు
- యథేచ్ఛగా మత్స్య సంపద దోపిడీ

పెంట్లవెల్లి, కొల్లాపూర్, న్యూస్‌టుడే : శ్రీశైలం తిరుగు జలాల్లో నిషేధిత వలలతో చేపల వేట యథేచ్ఛగా కొనసాగుతోంది. పర్యవేక్షించాల్సిన మత్స్య, రెవెన్యూ, పోలీసు, అటవీ శాఖల అధికారుల సమన్వయం కొరవడింది. ఇదే అదనుగా ఇతర ప్రాంతాలకు చెందిన అక్రమార్కులు నిషేధిత అలవి వలలతో చేపల వేట కొనసాగిస్తున్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా పెంట్లవెల్లి మండలంలోని కృష్ణా నది తీర గ్రామాలైన మల్లేశ్వరం, మంచాలకట్ట, జటప్రోల్, వనపర్తి జిల్లా చిన్నంబావి మండలం చెల్లెపాడు, కాలూరు, పెద్దమారూర్, చిన్నమారూర్, కొల్లాపూర్ మండలంలో సోమశిల, అమరగిరి, చీమలతిప్ప గ్రామాల కృష్ణా నది తీరంలోనే ఆంధ్రప్రాంత జాలర్లు గూడారాలు ఏర్పాటు చేసుకొని తిష్ఠ వేశారు. కృష్ణా నదిలోని మత్స్యసంపదను కొల్లగొడుతున్నారని స్థానిక మత్స్యకారులు ఆందోళన చెందుతున్నారు.



వేటాడి ఆరబెట్టిన చిన్నచేపలు

- స్థానికంగా కొందరు పెట్టుబడిదారులు, దళారులు కలిసి కృష్ణానదిలో నిషేధిత అలివి, పట్టువలలతో చిన్న చేపలను వేటాడిస్తున్నారు. ఆయా వలలను చేపల వేటకు వినియోగించకూడదనే నిబంధనలు ఉన్నా కొందరు అక్రమార్కులు ఇతర రాష్ట్రాలు, దూర ప్రాంతాల నుంచి మత్స్యకారులను రప్పించి మరీ దందా నడిపిస్తున్నారు. ఎక్కువగా ఆంధ్రప్రదేశ్‌లోని వైజాగ్, కొవ్వూరు, తణుకు, రాజమండ్రి, కాకినాడ తదితర ప్రాంతాల నుంచి జాలర్లను రప్పించారు. ఇందుకుగాను ఒక్కో జాలరికి ముందస్తుగా రూ.80వేల నుంచి రూ.లక్ష వరకు చెల్లిస్తున్నారు. నది ఒడ్డున స్థావరాలు ఏర్పాటు చేసుకుంటున్నా.. మత్స్యశాఖ అధికారులు పట్టించుకోకపోవడం అనుమానాలకు తావిస్తోంది.

దాడులు చేస్తాం..

అలివి వలలతో వేట సాగుతున్న విషయం మా దృష్టికి వచ్చింది. సిబ్బంది కొరతతో దాడులు చేయలేకపోయాం. రెవెన్యూ, పోలీసు, అటవీశాఖ అధికారులతో కలిసి దాడులు చేపడతాం. నిషేధిత వలలతో చిన్న చేపలను వేటాడితే మత్స్య సంపదకు తీవ్ర నష్టం. దాడులు చేసి బాధ్యులపై శాఖపరమైన కఠిన చర్యలు తీసుకుంటాం.

- రజనీ, మత్స్యశాఖ ఏడీ, నాగర్‌కర్నూల్ జిల్లా

పొగాకుతో అనారోగ్యం

నాగర్‌కర్నూల్, న్యూస్‌టుడే : పొగాకు ఉత్పత్తుల వినియోగంతో ప్రాణాంతకమైన వ్యాధులు వచ్చే అవకాశం ఉందని అదనపు కలెక్టర్ సీతారామారావు అన్నారు. బుధవారం సమీకృత కలెక్టరేట్‌లో పొగాకు నియంత్రణపై నిర్వహించిన జిల్లా టాస్క్‌ఫోర్స్ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. పొగాకుతో కలిగే ఆరోగ్య సమస్యలను ప్రజలకు వివరించాలన్నారు. ధూమపాన రహిత జిల్లాగా మార్చేందుకు కృషి చేయాలన్నారు. అన్ని శాఖల మండల స్థాయి అధికారులతో టాస్క్‌ఫోర్స్ సమావేశాలు నిర్వహించాలని ఆదేశించారు. పాఠశాలలు ఉన్న ప్రాంతాల్లో పొగాకు ఉత్పత్తులు అమ్మకుండా నిఘా పెట్టాలన్నారు. సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి స్వరాజ్యలక్ష్మి, డీఈవో చిన్న ఓబులేశ్, డీపీవో రామ్మోహన్‌రావు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

సొంత రెవెన్యూనే లక్ష్యం!

- రైతులను పట్టిపీడిస్తున్న అధికారులు
- స్థిరాస్తి వ్యాపారుల కబ్జాలు, అక్రమాలకు అండ

జడ్చర్లలో భూ వ్యవహారం సీసీఎల్ఏకు వెళ్లింది. ఓ సర్వే నంబరులోని 16 ఎకరాల 32 గుంటల స్థలంలో 2 ఎకరాల 10 గుంటల భూదాన్ భూమి ఉంది. దీనికి ఓఆర్‌సీ ఇచ్చారని, ఇందులో జిల్లాకు చెందిన రెవెన్యూ అధికారుల పాత్ర ఉందని ఆరోపణలు వచ్చాయి. దీనిపై వివరణ కోరినా సరిగ్గా స్పందించకపోవటంతో సీసీఎల్ఏ కమిషనర్ నవీన్ మిత్తల్ గత నెలలో జడ్చర్ల తహసీల్దార్ సత్యనారాయణరెడ్డిని సస్పెండ్ చేశారు.

తాజాగా కొల్లాపూర్ ఆర్డీవో నాగరాజుపైనా వేటు పడింది. ధరణిలో పాసు పుస్తకాలకు సంబంధించిన కోర్టు కేసుల పరిష్కారంలో నిర్లక్ష్యం వహించినందుకు విధుల నుంచి తొలగించారు. ఈ రెవెన్యూ డివిజన్ పరిధిలో ఇనామ్, ప్రభుత్వ భూములకు ఎన్‌వోసీ, ఓఆర్‌సీలు ఇచ్చారని, డబ్బులు ఇవ్వకపోతే ఏ పనీ చేయరని ఆరోపణలు ఉన్నాయి. మొత్తానికి ఆర్డీవోను భూసంబంధ వ్యవహారంలోనే సస్పెండ్ చేశారు.

ఈనాడు, మహబూబ్‌నగర్

కొల్లాపూర్ ఆర్డీవో, జడ్చర్ల తహసీలార్ కొద్ది రోజుల వ్యవధిలోనే సస్పెండ్ కావటం ఉమ్మడి జిల్లాలో పరిస్థితికి అద్దం పడుతోంది. ఈ ఏడాది గోపాల్‌పేట, గుండుమల్ తహసీల్దార్లు, కల్వకుర్తి ఆర్డీవో కార్యాలయం డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ సర్వేయర్ ఏసీబీకి పట్టుబడ్డారు. ఇలాంటి వాళ్లు ఉమ్మడి జిల్లాలో ఇంకా చాలా మంది ఉన్నారు. పాలమూరు వ్యాప్తంగా అసైన్డ్, సీలింగ్, భూదాన్ భూములు ఉన్నాయి. స్థిరాస్తి వ్యాపారులు, కొందరు నేతలు కలిసి రెవెన్యూ చట్టాల్లో ఉన్న లొసుగులను ఆసరాగా చేసుకుని ఎన్‌వోసీలు తీసుకుంటున్నారు. వీరికి సాంకేతికంగా ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా కొందరు రెవెన్యూ అధికారులు అన్నీ తామై వ్యవహరిస్తూ సహకరిస్తున్నారు. ఈ వ్యవహారాల్లో పెద్దఎత్తున డబ్బులు చేతులు మారుతున్నాయి. ఇద్దరు అధికారుల సస్పెన్షన్ నేపథ్యంలో జిల్లాల ఉన్నతాధికారులు దృష్టిసారించాల్సిన అవసరముంది.



మహబూబ్‌నగర్ : ప్రజావాణిలో కలెక్టర్‌కు భూ సమస్య వివరిస్తున్న బాధిత రైతులు

జిల్లాల్లో మచ్చుకు కొన్ని..

- మహబూబ్‌నగర్ జిల్లా గతంలో పనిచేసిన ఓ ఆర్డీవో ఏకంగా 50కి పైగా ఓఆర్‌సీలు ఇచ్చారు. జిల్లా కేంద్రంలోని ఓ ప్రభుత్వ భూమికి నిబంధనలకు విరుద్ధంగా ఓఆర్‌సీని ఇచ్చారు. ప్రభుత్వం మారిన తర్వాత జిల్లాకు చెందిన ఇద్దరు ముఖ్య ప్రజాప్రతినిధులు ఆ ఓఆర్‌సీపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఆ ఆర్డీవో ఓఆర్‌సీ ఇచ్చిన 50కి పైగా భూముల రిజిస్ట్రేషన్లను ఆపివేశారు. అంతర్గత విచారణ సాగుతోంది.
- వనపర్తి జిల్లాలోని ఓ పురపాలికలో దేవాలయానికి చెందిన సుమారు 30 ఎకరాల భూమికి గతంలో ఇక్కడ పనిచేసిన రెవెన్యూ అధికారులు అక్రమంగా ఓఆర్‌సీ ఇచ్చారు. హైదరాబాద్ - బెంగళూరు జాతీయ రహదారికి అనుకుని ఉన్న ఆ భూముల విలువ రూ.కోట్లల్లో ఉంది. ఈ వ్యవహారంలో కొందరు రెవెన్యూ అధికారులకు పెద్దఎత్తున మామూళ్లు అందించినట్లు అప్పట్లో ఆరోపణలు వచ్చాయి.
- హైదరాబాద్ - బెంగళూరు జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న బాలానగర్, రాజాపూర్, జడ్చర్ల, భూత్పూరులోని పలు ప్రభుత్వ భూములకు నిబంధనలకు విరుద్ధంగా ఓఆర్‌సీలు ఇచ్చినట్లు విమర్శలు ఉన్నాయి. జోగులాంబ గద్వాల, నాగర్‌కర్నూల్, నారాయణపేట జిల్లాల్లో కొన్ని చోట్ల ప్రభుత్వ భూములకు ఇష్టారాజ్యంగా ఓఆర్‌సీ, ఎన్‌వోసీలు ఇచ్చారని ఆరోపణలు వచ్చాయి.

ప్రజావాణిలో అన్నీ భూసమస్యలే : తమ భూ సమస్యలపై స్పందించటం లేదని, డబ్బులు ఇవ్వకపోతే పనులు చేయటం లేదని, నెలలు, ఏళ్ల తరబడిగా కార్యాలయం చుట్టూ తిప్పుతున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా కలెక్టరేట్‌లో ప్రజావాణికి వచ్చేవాళ్లల్లో 70 శాతం మంది భూ సమస్యల వాళ్లే. మండల, డివిజన్ స్థాయి అధికారులు పట్టించుకోకపోవటం వల్లనే ఇక్కడిదాకా వస్తున్నారని కలెక్టర్లు కూడా అంగీకరిస్తున్నారు. అయినా పరిస్థితి చక్కదిద్దటంలో విఫలమవుతున్నారు. ధరణిలో మొత్తం 33 మాడ్యూళ్లు ఉన్నాయి. ఎక్కువగా పాసుపుస్తకాల్లో పేర్లలో తప్పులు, సర్వే నంబర్లు గల్లంతు, డిజిటల్ సంతకాలు పెండింగ్, భూ విస్తీర్ణం తక్కువగా నమోదు తదితరాలపై ఫిర్యాదులు ఎక్కువగా వస్తున్నాయి. స్థానిక అధికారులు క్షేత్రస్థాయిలో విచారించి ఉన్నతాధికారులకు నివేదికను ఇవ్వాలి. ఇందుకు డబ్బులు డిమాండ్ చేస్తున్నారు.



కొలువుల పండగ.. ఆనందం నిండగా!

హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో కొత్త ఉపాధ్యాయులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి, మంత్రులు నియామక పత్రాలను అందజేశారు. దామరగిద్ద మండలం సజనాపూర్ గ్రామానికి చెందిన చెన్నప్ప నియామక పత్రం అందుకుంటున్న దృశ్యమిది.

- ఈనాడు, హైదరాబాద్

రెండు రోజుల్లోనే ధాన్యం డబ్బులు చెల్లింపు

నాగర్‌కర్నూల్, న్యూస్‌టుడే : ధాన్యం కొనుగోలు చేసిన 48 గంటల్లోపు రైతుల ఖాతాలో డబ్బులు జమయ్యేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ ఆదేశించారు. బుధవారం సమీకృత కలెక్టరేట్‌లో ఐకేపీ, సింగిల్ విండో, వ్యవసాయ శాఖ అధికారులకు ఖరీఫ్ వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలపై నిర్వహించిన అవగాహన సదస్సులో పాల్గొని మాట్లాడారు. జిల్లాలో ఈ సీజన్‌లో 2.18లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం వస్తుందని వ్యవసాయ శాఖ అంచనా వేసిందన్నారు. 251 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. వరి ధాన్యం క్వింటా ఏ గ్రేడ్ రకం రూ.2320, సాధారణ రకం రూ.2300లు చెల్లించనున్నట్లు చెప్పారు. సన్న రకానికి అదనంగా రూ.500లు బోనస్ చెల్లిస్తారన్నారు. రైతులు ఇబ్బందులు పడకుండా ధాన్యం సేకరణ పారదర్శకంగా చేయాలన్నారు. సరిపడా టార్పలిన్లు ప్రస్తుతం అందుబాటులో ఉన్నాయన్నారు. వాతావరణ పరిస్థితులను రైతులకు ఎప్పటికప్పుడు సమాచారం ఇవ్వాలన్నారు. ఇతర రాష్ట్రాల నుంచి జిల్లాకు ధాన్యం రాకుండా పక్కా నిఘా ఉంచాలని ఆదేశించారు. అదనపు కలెక్టర్ సీతారామారావు, డీఎస్‌వో శ్రీనివాస్, డీఆర్‌డీవో చిన్న ఓబులేష్, డీఏవో చంద్రశేఖర్, సివిల్ సప్లై డీఎం రాజేందర్ పాల్గొన్నారు.




ఆశల పథకం.. నిర్వహణ అధ్వానం

మహాత్మాగాంధీ కల్వకుర్తి ఎత్తిపోతల పథకం (కేఎల్ఐ) పైపులకు కంప, వివిధ రకాల మొక్కలతో గండం పొంచి ఉంది. కృష్ణానది ఒడ్డున కేఎల్ఐ మూడో లిఫ్ట్, జొన్నలబొగుడ జలాశయం వద్ద రెండో లిఫ్ట్ నిర్మాణం చేశారు. సంపు, పంపువెల్ నుంచి నీటిని జలాశయాలకు ఎత్తిపోయడానికి మోటార్ల నుంచి డెలివరీ సిస్టర్న్‌కు అయిదు భారీ పైపులు ఏర్పాటు చేశారు. ఏటా మోటార్లతో పైపుల ద్వారా నీటిని ఎత్తిపోసి నాగర్‌కర్నూల్, వనపర్తి జిల్లాలకు సాగునీరు అందిస్తున్నారు. దశాబ్దకాలంగా పైపుల మధ్యన చిన్న మొక్కలు ఏపుగా పెరిగాయి. చెట్లమానులు, వేర్లతో పైపులకు సమస్య వచ్చే ప్రమాదం ఉంది.

- న్యూస్‌టుడే, కోడేరు, కొల్లాపూర్ గ్రామీణం

స్థైర్యం వీడొద్దు.. ప్రశాంతత చెదరొద్దు!

- మానసిక ఆరోగ్యానికి ఇవే కీలకం
- ఉమ్మడి జిల్లాలో పెరుగుతున్న బాధితులు



మానసిక సమస్యలతో బాధపడే వారు రోజురోజుకు పెరిగిపోతున్నారు. ఎప్పుడూ చిన్నబోయి కనిపించటం, తనలో తానే మాట్లాడుకోవటం, పరధ్యానంలో ఉండటం, కుంగిపోవటం, చిన్నదానికి ఏడవటం వంటి సమస్యలతో బాధపడుతున్నారు. ఇవ్వన్నీ మానసిక సమస్యలే అయినా అవగాహన లేక అలా భావించటం లేదు. వైద్యం చేయించుకోవటం లేదు. 'ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం' నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలో పరిస్థితిపై 'న్యూస్‌టుడే' కథనం.

- న్యూస్‌టుడే, పాలమూరు

ఉదయం నుంచి రాత్రి వరకు తమ పనులను ప్రశాంత వాతావరణంలో చేసుకుపోయే వ్యక్తులు మానసికంగా ఆరోగ్యంగా ఉంటారు. ఆలోచనలు, ఆకాంక్షలు, జీవితంపై అంచనాలు ఒకరకంగా, చేసే పనులు, వారి పరిస్థితులు మరో రకంగా ఉంటే మానసిక సంఘర్షణకు, ఒత్తిడికి గురవుతారు. తద్వారా వ్యాకులత చెంది వింతగా ప్రవర్తిస్తారు. ధూమపానం, మద్యపానం, మాదక ద్రవ్యాలకు అలవాటు పడిన వారు కూడా ఒత్తిడికి గురవుతుంటారు. ఫలితంగా వారు ఏం చేస్తున్నారో, ఎవరితో ఏం మాట్లాడుతున్నారో అర్థం కాని పరిస్థితి నెలకొంటుంది. ఇంట్లో కుటుంబ సభ్యుల ప్రేమ పొందలేనివారు, చదువులో వెనకబడినవారు, ఉద్యోగం రావటం లేదని బాధపడేవారు, అనారోగ్య, ఆర్థిక సమస్యలతో ఉన్నవారు మానసిక రుగ్మతలతో సతమతమవుతుంటారు. వీరంతా మానసిక వైద్య నిపుణులను సంప్రదిస్తే నయం చేస్తారు. అవగాహన లేక ఉమ్మడి జిల్లాలో చాలా మంది భూతవైద్యులను ఆశ్రయించి జీవితాలు పాడు చేసుకుంటున్నారు.

రోజూ 150కి పైగా కేసుల రాక : మహబూబ్‌నగర్, నారాయణపేట, వనపర్తి, జోగులాంబ గద్వాల, నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రాల్లో ప్రభుత్వ జనరల్ ఆసుపత్రులు, వైద్య కళాశాలలు ఉండటంతో మానసిక వైద్యసేవల విభాగాలు అందుబాటులోకి వచ్చాయి. వివిధ రకాల మానసిక రుగ్మతలతో బాధపడుతున్నవారు ఉమ్మడి జిల్లాలోని ఆసుపత్రులకు కనీసం రోజుకు 150, నెలకు 4,500 మంది వస్తున్నారు. రుగ్మత తీవ్రంగా ఉంటే వైద్యులు ఔషధాలు ఇస్తున్నారు. తీవ్రత తక్కువగా ఉండి, కుటుంబ సభ్యుల సహకారం ఉంటే కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నారు.



మహబూబ్‌నగర్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న మానసిక వైద్య నిపుణులు డా.రమాకాంత్

మానసిక రుగ్మతలు చాలా రకాలు.. : ఒకే విషయాన్ని పదే పదేగా ఆలోచించడం, దానిపైనే ధ్యాస కలిగి ఉండటం వల్ల మానసిక రుగ్మతలు వస్తుంటాయి. మానసిక రుగ్మతలు చాలా రకాలుగా ఉన్నాయి. ఒత్తిడి, ఆందోళన, వ్యాకులత, ఆత్మన్యూనత, విచిత్రంగా ప్రవర్తించడం, చేసిన పనిని పదే పదే చేస్తుండటం, అతిగా జాగ్రత్తలు తీసుకోవటం, గతంలో జరిగిన చెడు ఘటనలు తరచూ తలచుకుని బాధపడటం, మద్యపానం, ధూమపానం, మాదక ద్రవ్యాలు, గంజాయికి బానిస కావటం, తనలో తానే మాట్లాడుకోవటం, ఎవరు పిలిచినా స్పందించకుండా పిచ్చివారిలా ప్రవర్తించడం చేస్తుంటారు. ఆత్మహత్య ప్రయత్నం అనేది కూడా మానసిక రుగ్మతనే.

కుటుంబ సభ్యుల సహకారం అవసరం.. : ఉద్యోగ సాధన, ప్రేమ, వ్యాపారం ఇలా ఏదైనా విషయంలో విఫలమైనా, తీవ్ర ఒత్తిడికి లోనయినా, లైంగిక వేధింపులకు గురైనా, ఆర్థిక, అనారోగ్య సమస్యలు వెంటాడినా బాధితులకు కుటుంబ సభ్యులు అండగా నిలిచి భరోసా ఇస్తే మందులు అవసరం ఉండదు. కుటుంబ సభ్యుల నుంచే ప్రేమ, ఆదరణ కరవైతే వారు ఏకాకిగా మారుతారు. తీవ్ర ఒత్తిడికి గురవుతారు. అందుకే ఏ సమస్య వచ్చినా చెప్పుకొనేలా, చర్చించేలా ప్రోత్సహించాలి.

ఆల్కహాల్ బానిసలే ఎక్కువ.. : ఉమ్మడి జిల్లాలోని మానసిక రుగ్మతల బాధితుల్లో ఎక్కువ మంది ఆల్కహాల్ బానిసలే. ఆ తర్వాత స్థానంలో ధూమపానం, మాదక ద్రవ్యాలకు బానిసైన వాళ్లు ఉన్నారు. బాధితుల్లో 30 నుంచి 50 ఏళ్ల వారే ఎక్కువగా ఉంటున్నారు. చిన్న చిన్న వాటికి తల్లిదండ్రులు తిడుతున్నారని, కొడుతున్నారని, చదువులో రాణించలేకపోతున్నానని మానసిక ఒత్తిడికి గురవుతున్న టీనేజ్ విద్యార్థులు కూడా ఉంటున్నారు. అన్ని మానసిక సమస్యలకు పరిష్కార మార్గం ఉంది. మానసిక వైద్య నిపుణులను సంప్రదించాలి.

- డా.రమాకాంత్, మానసిక వైద్య నిపుణులు, మహబూబ్‌నగర్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి

ఇల వైభోగం.. ఆది దంపతుల కల్యాణం



కల్యాణంలో తలంబ్రాలు పోస్తున్న అర్చకులు

అలంపూర్, న్యూస్‌టుడే: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం జోగులాంబ, బాల బ్రహ్మేశ్వర స్వామి కల్యాణ మహోత్సవాన్ని అర్చకులు వైభవంగా నిర్వహించారు. ఉత్సవ విగ్రహాలను పల్లకి సేవలో జోగులాంబ ఆలయం వరకు ఎమ్మెల్యే విజయుడు, ఈవో పురేందర్, ఛైర్మన్ నాగేశ్వర్‌రెడ్డి, ధర్మకర్త సభ్యులు మాజీ ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి, ముఖ్యమంత్రి సోదరుడు తిరుపతి రెడ్డి దంపతులు మంగళ వ్యాయిదాలతో తీసుకొచ్చారు. ముస్తాబు చేసిన విగ్రహాలను ఆలయం చుట్టూ పల్లకిలో ఊరేగించి కల్యాణ మండపానికి చేర్చారు. వేదమంత్రాల నడుమ స్వామి, అమ్మ వార్ల కల్యాణం మూలా నక్షత్ర శుభ గడియలో నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కల్యాణోత్సవం తిలకించారు. అనంతరం అమ్మవారిని సింహవాహన సేవలో భాగంగా పట్టణంలోని పురవీధుల గుండా ఊరేగించారు.

కాళరాత్రిగా జోగులాంబ: జోగులాంబ దేవి భక్తులకు కాళరాత్రి రూపంలో దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు.



పల్లకి మోస్తున్న ఎమ్మెల్యే విజయుడు, మాజీ ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి, పట్టువస్త్రాలతో తిరుపతిరెడ్డి, తదితరులు

శివుని ముద్దుగుమ్మ.. బంగారు గౌరమ్మ



కల్వకుర్తి : బతుకమ్మతో న్యాయమూర్తులు శ్రీదేవి, కావ్య



నాగర్‌కర్నూల్ : పరేడ్ మైదానంలో బతుకమ్మతో ఎస్పీ సతీమణి రుచ



కలెక్టరేట్‌లో పూజ చేస్తున్న అదనపు కలెక్టర్ సీతారామారావు

కల్వకుర్తి పట్టణం, న్యూస్‌టుడే : కల్వకుర్తి కోర్టు ఆవరణలో బుధవారం బతుకమ్మ సంబురాలు ఘనంగా నిర్వహించారు. సీనియర్ సివిల్ జడ్జి శ్రీదేవి, జూనియర్ సివిల్ జడ్జి కావ్య ప్రత్యేకంగా బతుకమ్మలను తయారు చేసుకుని తోటి సిబ్బందితో కలిసి ఆడిపాడారు. సంప్రదాయబద్ధంగా నిర్వహించిన వేడుకల్లో అధిక మంది మహిళలు, బార్‌అసోషియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నాగర్‌కర్నూల్, న్యూస్‌టుడే : జిల్లాలో బుధవారం బతుకమ్మ సంబురాలు వైభవంగా నిర్వహించారు. సమీకృత కలెక్టరేట్‌లో మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సంబురాలను నిర్వహించారు. బతుకమ్మకు అదనపు కలెక్టర్ సీతారామారావు ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు పాటలు పాడుతూ.. ఉత్సాహంగా బతుకమ్మ ఆడారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమ శాఖ అధికారిణి రాజేశ్వరి, ఏవో చంద్రశేఖర్, డీఎంహెచ్‌వో స్వరాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. ● జిల్లా పశుసంవర్ధక శాఖ కార్యాలయంలో బతుకమ్మ వేడుకలను నిర్వహించారు.

పునరావాసానికి స్థల పరిశీలన



గ్రామస్థులతో మాట్లాడుతున్న డీఎఫ్‌వో రోహిత్ గోపిడి

పెద్దకొత్తపల్లి, న్యూస్‌టుడే : టైగర్ రిజర్వ్ ఫారెస్ట్ కింద ఉన్న గ్రామాలను తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు నాగర్‌కర్నూల్ జిల్లా అటవీ శాఖ అధికారి రోహిత్‌గోపిడి తెలిపారు. అందులో భాగంగానే అమ్రాబాద్ మండలం వటవర్లపల్లి గ్రామ ప్రజలను పెద్దకొత్తపల్లి మండలం బాచారం ఉన్న ప్రదేశానికి బుధవారం తీసుకొచ్చి చూపించారని చెప్పారు. మొదటి విడత కింద సార్లపల్లి, కుడిచింతలబైలు, కొల్లంపెంట, తాటిగుండాల్ గ్రామాలను తరలించేందుకు కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే అనుమతి ఇచ్చినట్లు వివరించారు. రెండో విడతలో భాగంగా వటవర్లపల్లి గ్రామంలోని 750 కుటుంబాలను తరలించేందుకు బాచారం వద్ద స్థలం చూపించారు. అయితే ఇక్కడ వ్యవసాయానికి అనువుగా లేదని కొంత మంది డీఎఫ్‌వో దృష్టికి తీసుకొచ్చారు. కార్యక్రమంలో దోమలపెంట ఎఫ్ఆర్‌వో గురుప్రసాద్ సరోడే, సిబ్బంది వెంకటేష్, ధర్మ, తేజశ్రీ తదితరులు పాల్గొన్నారు.

రెండు ప్రతిపాదనలు... : పునరావాసం కింద రెండు ప్రతిపాదనలను అధికారులు గ్రామస్థుల ముందు ఉంచారు. మొదటిది రూ.15 లక్షలు చెల్లించి, ఎలాంటి పునరావాసం కల్పించరు. రెండోది 260 గజాల ఇంటి స్థలం, 5 ఎకరాల భూమి కేటాయిస్తారు. మౌలిక వసతులు కల్పిస్తారు. మొదటి విడతలోని 4 గ్రామాల ప్రజలు ఈ రెండు ఆప్షన్లను ఎంచుకుంటుండడం గమనార్హం.

సర్కారు సహకారం అందిపుచ్చుకోవాలి: ఎమ్మెల్యే

కల్వకుర్తిపట్టణం, న్యూస్‌టుడే : ప్రభుత్వం వివిధ పథకాల పేరుతో లబ్ధిదారులకు అందిస్తున్న సహకారాన్ని అందిపుచ్చుకుని ఆర్థికాభివృద్ధి సాధించాలని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. బుధవారం క్యాంపు కార్యాలయంలో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేసి మాట్లాడారు. అన్ని వర్గాల ప్రజలకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో నాయకులు అనంద్‌కుమార్, విజ్‌కుమార్‌రెడ్డి, బాలాజీసింగ్, అశోక్‌రెడ్డి, భూపతిరెడ్డి వివిధ మండలాల నాయకులు పాల్గొన్నారు.


అసలే పేదరికం.. ఆపై క్యాన్సర్ భూతం


తల్లిదండ్రులతో అనిల్

మక్తల్ మండలం సంగంబండ గ్రామానికి చెందిన కళప్ప గొర్రెల కాపరిగా, అతని భార్య పద్మమ్మ రోజుకూలీగా కష్టపడుతూ ఇద్దరు పిల్లలనూ చదివిస్తున్నారు. ఉన్నంతలో సంతోషంగా జీవిస్తున్న ఆ కుటుంబంలోకి క్యాన్సర్ భూతం అడుగుపెట్టింది. ఇంటర్ చదువుతున్న కుమారుడు అనిల్‌ను కబళించింది. ఇన్నిరోజులూ పోగేసిన డబ్బంతా రక్త క్యాన్సర్ చికిత్సకు నీళ్లలా ఖర్చు చేయాల్సి వచ్చింది. గొర్రెలు విక్రయించి హైదరాబాద్‌లోని బసవతారకం క్యాన్సర్ ఆసుపత్రిలో కీమోథెరపీ చేయించారు. ఇప్పటికే రూ.10లక్షలు ఖర్చయినా జబ్బు పూర్తిగా నయం కాలేదు. మరో రూ.10లక్షలు ఖర్చుచేస్తే తప్ప బాబు కోలుకోలేడని వైద్యులు చెప్పారు. అంత స్తోమత లేక హైదరాబాద్ నుంచి స్వగ్రామానికి తీసుకువచ్చారు. ఈ విషయం తెలిసిన ఓ ప్రయివేటు పాఠశాల యాజమాన్యం తరఫున తిరుపతిరెడ్డి దంపతులు రూ.1.20లక్షల ఆర్థిక సాయం అందించడంతోపాటు కుమార్తె పదోతరగతి వరకు ఉచిత విద్యను అందించడానికి ముందుకు వచ్చారు. దాతలు సహృదయంతో స్పందిస్తే 18ఏళ్ల యువకుడికి నిండు నూరేళ్ల జీవితం ఇచ్చినట్లు అవుతుంది.


మక్తల్ పట్టణం, న్యూస్‌టుడే

గుండె నిండా బడిగంటలు



బావ, బావమరుదులు ఒకేసారి


మోహన్‌నాయక్


తుల్జానాయక్

ధన్వాడ, న్యూస్‌టుడే : ముదుగుల మల్లయ్యతండాకు చెందిన మోహన్‌నాయక్ ధన్వాడ మండలంలోని మందిపల్లి కొత్త తండాకు చెందిన తుల్జానాయక్ అక్కను వివాహమాడారు. మోహన్ నాయక్, తుల్జానాయక్ ఇద్దరూ డీఎస్సీకి ఎంపికై ఎస్జీటీలుగా నియమితులయ్యారు. ఒకే సారి బావ బామ్మర్దులకు కొలువులు రావడంపై రెండు కుటుంబాలతో పాటు ఆయా తండాల్లో సంతోషం వ్యక్తం అవుతోంది

రెండు నెలల్లో రెండు..


జి.గోవర్ధన్

ధన్వాడ, న్యూస్‌టుడే: నారాయణపేట జిల్లా ధన్వాడ మండలం మందిపల్లి గ్రామానికి చెందిన జి.గోవర్ధన్‌కు వరుసగా రెండు కొలువులు దక్కాయి. రెండు నెలల క్రితం ఈయనకు బీసీ గురుకులంలో ఉపాధ్యాయుడు ఉద్యోగం వచ్చింది. ఇందులో ప్రవేశం పొందిన ఈయనకు ఇపుడు స్కూల్ అసిస్టెంట్(గణితం) ఉద్యోగం వచ్చింది. జిల్లాస్థాయిలో గణితంలో మూడో ర్యాంకు సాధించిన ఈయన గురుకులం ఉద్యోగం వదిలి స్కూల్ అసిస్టెంట్ ఉత్తర్వులు అందుకున్నారు. వ్యవసాయ కుటుంబానికి చెందిన ఈయన ఉద్యోగాలు రాక ముందు ప్రైవేటు ఉపాధ్యాయుడిగా పనిచేస్తూనే వ్యవసాయంలో తండ్రికి సహాయపడుతూ వచ్చాడు. గణితమంటే చాలా ఇష్టమని, అదే సబ్జెక్టు ఉపాధ్యాయుడిగా అవకాశం రావడం ఆనందాన్ని కలిగించిందన్నారు.

అన్నదమ్ములు సాధించారు


నియామక పత్రాలతో సోదరులు వెంకటేశ్, శ్రీనివాస్

కోస్గి న్యూటౌన్, న్యూస్‌టుడే : ఉపాధ్యాయులుగా స్థిరపడాలన్న అన్నదమ్ముల లక్ష్యం నెరవేరగా.. అందులో ఒకరు మూడు కొలువులు సాధించి ఔరా అనిపించారు. కోస్గి మండలం పీసీ తండాకు చెందిన ఎస్.నార్యానాయక్, కిష్టమ్మ దంపతుల కుమారులు ఎస్.వెంకటేశ్, ఎస్.శ్రీనివాస్‌నాయక్‌లు 2024 డీఎస్సీలో సత్తాచాటి ఉపాధ్యాయులుగా నియమితులయ్యారు. ఎస్జీటీ జనరల్ కేటగిరిలో తమ్ముడు ఎస్.శ్రీనివాస్ నాయక్ 19వ ర్యాంకు, అన్న ఎస్.వెంకటేశ్‌కు 11వ ర్యాంకు వచ్చింది. ఎస్.శ్రీనివాస్ ప్రస్తుతం విశాఖపట్నంలోని కేంద్రీయ విశ్వవిద్యాలయంలో పీఆర్‌టీ ఉపాధ్యాయులుగా పనిచేస్తుండగా ఇటీవల గ్రూప్-4 పోటీపరీక్షల్లో ప్రతిభచాటి ఉద్యోగం సాధించారు. ఎస్జీటీగా కొనసాగుతామని వారు వివరించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకున్న వీరు ఒకేసారి ఉపాధ్యాయులుగా నియమితులు కావడంతో గ్రామంలో హర్షాతిరేకాలు వెల్లివిరిశాయి.

ఒకే తండాలో ముగ్గురికి..


మీనాక్షి


తరుణ్


జగన్నాథ్

కోయిలకొండ, న్యూస్‌టుడే: కొయిలకొండ మండలంలోని కేశ్వాపూర్ పంచాయతీ పరిధి పెద్దతండాకు చెందిన ముగ్గురు ఎస్జీటీ ఉద్యోగాలకు ఎంపికై ఔరా అనిపించారు. వ్యవసాయ కుటుంబానికి చెందిన వీరు తల్లిదండ్రుల ఆశయాలు నెరవేర్చేందుకు కష్టపడి చదివి సత్తాచాటారు. జిల్లాలో ఎస్టీ విభాగంలో 12 ఎస్జీటీ పోస్టులు ఉండగా ఒకే పెద్దతండాకు చెందిన మీనాక్షి, తరుణ్, జగన్నాథ్‌లు ఎంపిక కావడం విశేషం. మీనాక్షి, జగన్నాథ్‌లు గురుకుల ఉద్యోగాలకు ప్రయత్నించి విఫలమైనా అధైర్యపడకుండా ఎస్జీటీలో సత్తాచాటారు.

మూడు ఉద్యోగాలతో జయకేతనం


తల్లిదండ్రులతో రాజేశ్వరి ఎడమ నుంచి రెండో వ్యక్తి

ఊట్కూరు, న్యూస్‌టుడే : నారాయణపేట మండలం శాసన్‌పల్లి గ్రామానికి చెందిన జయశ్రీ, కృష్ణయ్య దంపతులకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు. గ్రామంలో చిన్న టీకొట్టు నడుపుతూ పిల్లల్ని చదివిస్తున్నారు. పెద్ద కుమార్తె రాజేశ్వరి కష్టపడి చదివి 2017 డీఎస్సీకి హాజరుకాగా 0.6 మార్కుతో ఉద్యోగం కోల్పోయారు. తల్లిదండ్రుల కష్టం మనసులో ఉంచుకుని ఆత్మవిశ్వాసం కోల్పోకుండా పోటీపరీక్షలకు సిద్ధమయ్యారు. గురుకుల ఉపాధ్యాయుల ఎంపిక పరీక్షల్లో ప్రతిభ చాటి టీజీటీ ఆంగ్లం, సాంఘికశాస్త్రం ఉద్యోగాలు సాధించారు. మూడు నెలల క్రితం మక్తల్ జ్యోతిబా పులే గురుకుల పాఠశాలలో ఆంగ్ల ఉపాధ్యాయురాలిగా చేరారు. ప్రస్తుతం ఎస్జీటీగా అవకాశం వచ్చినా తరువాత ర్యాంకు వారికి అవకాశం వస్తుందనే భావనతో వదులుకుంటున్నట్లు చెప్పారు. ఇదే స్ఫూర్తితో సివిల్స్ ఉద్యోగం సాధించటమే లక్ష్యమని చెబుతున్నారు.

ఔరా! ఐదు కొలువులు


వెంకట్రామి రెడ్డి, గుండుమాల్

కోస్గి, న్యూస్‌టుడే: ఒకటి కాదు... రెండు కాదు... అయిదు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించడం అంటే మాటలా? కానీ చేసి చూపించారు గుండుమాల్‌కు చెందిన బాయికాడి వెంకట్రామిరెడ్డి. తండ్రి నారాయణరెడ్డి, తల్లి యశోద వ్యవసాయం చేసుకుంటూ ఆయనను చదివించారు. 2020లో కానిస్టేబుల్ ఉద్యోగం రాగా, చేయడం ఇష్టం లేక వెళ్లలేదు. ఉపాధ్యాయ వృత్తిపై మక్కువతో 2017లో ఎస్జీటీ ఉద్యోగం సాధించారు. ప్రస్తుతం భక్తిమళ్ల ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్నారు. ఇటీవల డీఎస్సీలో సాంఘికశాస్త్రంలో జిల్లాస్థాయి మొదటి ర్యాంకు, తెలుగులో ఎనిమిదో ర్యాంకు సాధించి స్కూల్ అసిస్టెంట్ పోస్టులకు ఎంపికయ్యారు.. మరో పరీక్షలో రాష్ట్రస్థాయి 164వ ర్యాంకు సాధించి సాంఘిక సంక్షేమాధికారిగా ఎంపికయ్యారు. . తాను ఉపాధ్యాయుడిగానే కొనసాగి పేద విద్యార్థులకు సహాయపడతానని వెంకట్రామిరెడ్డి చెప్పారు.

యాభైలో పడినా...


అశ్విని నర్సింలు

ధన్వాడ : ధన్వాడ పట్టణానికి చెందిన అశ్విని నర్సింలు స్కూల్ అసిస్టెంట్‌గా ఎంపికయ్యారు. నిరుపేద కుటుంబానికి చెందిన ఈయన తెలుగు పండిట్ కోర్సు చదువుకున్నారు. ప్రైవేటు పాఠశాలలో టీచర్‌గా పని చేస్తూనే, ఇంటి వద్ద ట్యూషన్లు చెబుతూ, కులవృత్తి చేస్తూ ఇద్దరు పిల్లలతో కుటుంబాన్ని నెట్టుకొస్తున్నారు. వయసు 50లో పడినా ఇదే చివరి అవకాశం కావడంతో అహర్నిశలు కష్టపడ్డారు.

సహకారంతో గెలిచారు..


చెన్నప్ప, సజనాపూర్

దామరగిద్ద : సజనాపూర్ గ్రామానికి చెందిన లక్ష్మి, హన్మంతు దంపతులకు అయిదుగురు సంతానంలో మూడోవారు చెన్నప్ప. ఈ కుటుంబం వ్యవసాయం, గొర్రెల పెంపకంతో జీవనం సాగిస్తోంది. ఆర్థిక పరిస్థితులు అనుకూలించని స్థితిలో వ్యాస్ స్వచ్ఛంద సంస్థ సహకారంతో చెన్నప్ప చదువును కొనసాగించారు. ఇటీవల డీఎస్సీలో జిల్లాలో 13వ ర్యాంకుతో ఉపాధ్యాయ నియామక పత్రాన్ని సీఎం చేతులమీదుగా అందుకున్నారు. పేద విద్యార్థులను ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దడమే లక్ష్యమని చెన్నప్ప చెప్పారు.

భర్త ప్రోత్సాహంతో మూడు..


మమత

వనపర్తి పట్టణం : కొత్తకోటకి చెందిన మమత మూడు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించారు. భర్త రాఘవరెడ్డి ప్రోత్సాహంతో వీటిని సాధించానని ఆమె తెలిపారు. టీజీటీ గణితం ఉద్యోగానికి ఎంపికై [illegible] గురుకుల పాఠశాలలో పని చేస్తున్నారు. ఇటీవల విడుదలైన డీఎస్సీ ఫలితాల్లో స్కూల్ అసిస్టెంట్ గణితంలో జిల్లా స్థాయిలో నాలుగో ర్యాంకు సాధించారు. బుధవారం హైదరాబాద్‌లో నియాయక పత్రం అందుకున్నారు. హాస్టల్ వార్డెన్‌గా ఎంపికైనప్పటికీ ధ్రువపత్రాల పరిశీలన కాలేదు.

ఊట్కూరు.. ఆరుగురు


కె.అశోక్, మాలతి లత

ఊట్కూరు : ఊట్కూరు నుంచి ఏకంగా ఆరుగురు ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. సర్దార్‌నగర్ ప్రాంతానికి చెందిన జి.ప్రదీప్ తెలుగు పండింట్‌గా, శ్రీరాంనగర్ ప్రాంతానికి చెందిన కె.అశోక్ స్కూల్ అసిస్టెంట్(ఆంగ్లం)గా నియామకపత్రాలు అందుకున్నారు. మాలతి లత జీవశాస్త్రం స్కూల్ అసిస్టెంట్‌గా, కార్గిల్ చౌరస్తా ప్రాంతానికి చెందిన యువకుడు మహేశ్, శివాజీనగర్ ప్రాంతానికి చెందిన భారతి ఎస్జీటీలుగా నియామక పత్రాలు అందుకున్నారు. టి.మోనప్ప(పాతపేట) హిందీ పండిట్‌గా ఎంపికయ్యారు. వీరంతా ఊట్కూరు పేరును మార్మోగించారు.

రోలర్ స్కేటింగ్‌లో జాతీయ స్థాయికి



బంగారు పతకంతో రితిక్ అభిమన్యురెడ్డి (మధ్యలో)

ధరూరు, న్యూస్‌టుడే : మిర్జాపురం గ్రామానికి చెందిన రితిక్ అభిమన్యురెడ్డి రాష్ట్ర స్థాయి రోలర్‌స్కేటింగ్ పోటీల్లో బంగారు పతకం సాధించాడు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన కారణంగా జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. డిసెంబరులో మైసూరులో 11 ఏళ్లలోపు విభాగం రోలర్‌స్కేటింగ్ జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొననున్నాడు. గ్రామీణ ప్రాంతానికి చెందిన విద్యార్థి విశేషమైన క్రీడను ఎంపిక చేసుకొని జాతీయ స్థాయికి ఎంపిక కావటంపై గ్రామస్థులు అభినందించారు.

వరి కంకులను తలపిస్తున్న మంచు బిందువులు



మంచు కురిసె.. కంకుల్లా మెరిసె!

వాతావరణంలో మార్పు చోటు చేసుకుంది. తెల్లవారు జామున మంచు కురుస్తోంది. మంచు కరిగి వరి పైరు కొనలపై నీటి బిందువులు సూర్య కిరణాలకు మెరుస్తూ కంకులను తలపిస్తున్నాయి. వనపర్తి జిల్లా గోపాల్‌పేట ప్రాంతంలో ఈ చిత్రాలు 'న్యూస్‌టుడే' కెమెరాకు చిక్కాయి. - న్యూస్‌టుడే, వనపర్తి వ్యవసాయం


వరి పైరుపై మెరుస్తున్న మంచు బిందువులు

పీజీ వైద్య సీట్లకు కసరత్తు

ఎముకలు, ఈఎన్‌టీ, మత్తుమందు, నేత్ర విభాగాల్లో దరఖాస్తు


పీజీ సీట్లపై చర్చిస్తున్న ప్రభుత్వ వైద్య కళాశాల డైరెక్టర్ డా.రమేశ్, సూపరింటెండెంట్ డా.సంపత్‌కుమార్ సింగ్, సహాయ ఆచార్యులు డా.కిరణ్‌ప్రకాశ్ తదితరులు

పాలమూరు, న్యూస్‌టుడే : పీజీ సీట్ల కోసం మహబూబ్‌నగర్ ప్రభుత్వ వైద్య కళాశాల అధికారులు కసరత్తు చేస్తున్నారు. 2016లో కళాశాల ప్రారంభమైంది. ఐదేళ్ల తర్వాత నుంచి పీజీ సీట్ల కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. 2021 నుంచి దరఖాస్తు చేసేందుకు జాతీయ వైద్య కమిషన్ (ఎన్ఎంసీ) అనుమతి ఇచ్చినా ఆయా వైద్య విభాగాలకు తగినంత ఆచార్యులు, అసోసియేట్ ఆచార్యులు, సహాయ ఆచార్యులు లేకపోవడంతోనే సీట్లు మంజూరు కావటం లేదు. కొత్తగా దరఖాస్తు చేస్తున్న వైద్య విభాగాలపై 'న్యూస్‌టుడే' కథనం.

ప్రస్తుతం ఉన్నవి 29 మాత్రమే : మహబూబ్‌నగర్ వైద్య కళాశాలలో నాన్ క్లినికల్ విభాగాల్లో 23 పీజీ సీట్లు ఉన్నాయి. క్లినికల్‌లో ప్రసూతి విభాగానికి రెండేళ్ల క్రితం అనుమతి రాగా ఆరు పీజీ సీట్లు మంజూరయ్యాయి. ఈ ఏడాది పిడియాట్రిక్(చిన్నపిల్లలు), ఆప్తమాలజీ(కన్ను), అనస్థీషియా(మత్తుమందు) తదితర విభాగాల్లో పీజీ సీట్లకు దరఖాస్తు చేయగా ఎన్ఎంసీ పిడియాట్రిక్‌కే అనుమతి ఇచ్చింది. ఈ విభాగంలో మంజూరయ్యే నాలుగు పీజీ సీట్లల్లో వచ్చే నెలలో వైద్య విద్యార్థులు ప్రవేశాలు పొందనున్నారు. తగినంత మంది ఆచార్యులు, వైద్య సిబ్బంది లేకపోవడంతో ఆప్తమాలజీ, అనస్థీషియా విభాగాలకు అనుమతి రాలేదు. నెల క్రితం జరిగిన బదిలీల్లో కళాశాలకు అనస్థీషియా, ఆప్తమాలజీ ఆచార్యులు రావటంతో ఆయా విభాగాల్లో పీజీ సీట్ల కోసం మళ్లీ దరఖాస్తు చేస్తున్నారు. వీటికి కూడా అనుమతి లభిస్తే అదనంగా నాలుగు చొప్పున 8 పీజీ సీట్లు మంజూరవుతాయి. 2025 విద్యా సంవత్సరానికి గాను ఆర్థోపెడిక్ (ఎముకలు, కీళ్లు), ఈఎన్‌టీ (గొంతు, ముక్కు, చెవి) కోర్సుల్లో నాలుగు చొప్పున సీట్ల కోసం ఈ నెల 17న దరఖాస్తు చేయడానికి కళాశాల అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఫీజుగా ఒక్కో విభాగానికి రూ.5.90 లక్షల చొప్పున మొత్తం రూ.11.80 లక్షలు ఎన్ఎంసీకి చెల్లిస్తున్నారు. సిబ్బంది కూడా ఉండటంతో వీటికి పీజీ సీట్లు వస్తాయని నమ్ముతున్నారు.

ముఖ్య విభాగాలకే మొండిచేయి.. : మహబూబ్‌నగర్ జనరల్ ఆసుపత్రిలో సగానికి పైగా రోగులు జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ వైద్య సేవల కోసమే వస్తున్నారు. ఇక్కడ జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ విభాగాల్లో పీజీ సీట్లు చాలా అవసరం. జనరల్ మెడిసిన్ విభాగంలో నాలుగు పీజీ సీట్లు రావడానికి ఒక ఆచార్యుడు, ఏడుగురు అసోసియేట్ ఆచార్యులు, 15 మంది సహాయ ఆచార్యులు, 220 పడకలు, ఏడు యూనిట్లు ఉండాలి. పడకలు, యూనిట్లు ఉన్నా.. ఒక ఆచార్యురాలు, నలుగురు అసోసియేట్ ఆచార్యులు, ఐదుగురు సహాయ ఆచార్యులు మాత్రమే ఉండటంతో పీజీ సీట్ల కోసం దరఖాస్తు చేయడం లేదు. జనరల్ సర్జరీ విభాగంలో ఆచార్య పోస్టు ఖాళీగా ఉంది. ఒక అసోసియేట్ ఆచార్యుడు, ఆరుగురు సహాయ ఆచార్యులు ఉన్నారు. ఫలితంగా పీజీ సీట్లు వచ్చే అవకాశం లేకుండా పోయింది. జనరల్ సర్జరీ విభాగంలో వైద్యులు లేక తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

ట్రాలీ ఆటో బోల్తా.. నలుగురికి తీవ్రగాయాలు

చికిత్స పొందుతూ కర్నూలు ఆసుపత్రిలో ఇద్దరి మృతి


క్షతగాత్రులను అంబులెన్స్‌లోకి ఎక్కిస్తున్న స్థానికులు

పెబ్బేరు పట్టణం, గద్వాల గ్రామీణం, న్యూస్‌టుడే: పెబ్బేరు మండలంలోని రంగాపూర్ గ్రామ శివారు వద్ద జాతీయ రహదారిపై బుధవారం ట్రాలీ ఆటో అదుపుతప్పి బోల్తాపడింది. ప్రమాదంలో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల వివరాల ప్రకారం.. గద్వాల మండలం చెనుగోనిపల్లి గ్రామానికి చెందిన 15 మంది కుటుంబ సభ్యులు వనపర్తి జిల్లా ఖిల్లాగణపురం మండలం ఉప్పర్‌పల్లి గ్రామానికి వెళ్లి పెళ్లి సంబంధం కుదుర్చుకుని వస్తుండగా జాతీయ రహదారిపై ట్రాలీ ఆటో టైర్ పంక్చర్ అయి అదుపుతప్పి బోల్తా పడింది. ఆటోలో ప్రయాణిస్తున్న 15 మందిలో నలుగురికి తీవ్ర గాయాలు కాగా వారిని జాతీయ రహదారి అంబులెన్స్‌లో కర్నూలు ఆసుపత్రికి, స్వల్ప గాయాలైన వారిని గద్వాల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వీరిలో బోయ ముద్దు చిన్నరాముడు(60), బోయ మునెన్న(70) కర్నూలులోని ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందారు. దీంతో చెనుగోనిపల్లి గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. రోదనలు మిన్నంటాయి. ప్రమాదంపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని పెబ్బేరు ఎస్సై హరిప్రసాద్‌రెడ్డి తెలిపారు.

ఆదర్శ సమాజ నిర్మాణంలో మహిళల పాత్ర కీలకం/ రాష్ట్ర సేవికా సమితి ప్రాంత సహ బౌద్ధిక్ ప్రముఖ్ ఉమాదేవి


మహబూబ్‌నగర్‌లో రాష్ట్ర సేవికా సమితి కార్యకర్తల పథసంచలనం


మాట్లాడుతున్న ఉమాదేవి

మహబూబ్‌నగర్ సాంస్కృతికం, న్యూస్‌టుడే : శక్తికి ప్రతిరూపం మహిళ అని రాష్ట్ర సేవికా సమితి ప్రాంత సహ బౌద్ధిక్ ప్రముఖ్ ఉమాదేవి అన్నారు. మహబూబ్‌నగర్ పట్టణం బండమీదిపల్లి లోని సాందీపని ఆవాసంలో వారంరోజుల పాటు ప్రారంభిక శిక్షా వర్గను నిర్వహించి చివరిరోజు బుధవారం పట్టణంలో పథసంచలనం నిర్వహించారు. మాడల్ బేసిక్ పాఠశాల నుంచి ర్యాలీగా ప్రారంభమై బాలగంగాధర్‌తిలక్ చౌరస్తా, గడియారం, మార్కెట్ రోడ్, పాతబస్టాండ్, పాన్‌చౌరస్తా, రాంమందిర్‌చౌరస్తా, రాంనగర్, వన్‌టౌన్ మీదుగా తిరిగి పాఠశాలకు చేరుకున్నారు. ముఖ్య వక్తగా ఉమాదేవి మాట్లాడుతూ.. సృష్టికి మూలం మహిళా అని అభివర్ణించారు. తమ కుటుంబాన్ని ఏవిధంగా సక్కదిద్దుకుంటుందో ఆదర్శవంతమైన సమాజ నిర్మాణంలో కూడా ప్రతి మహిళ పాలుపంచుకోవాలని విజ్ఞప్తి చేశారు. సభాధ్యక్షురాలు డా.కె.పద్మావతి మాట్లాడుతూ.. సమాజంలో జరుగుతున్న అఘాయిత్యాలను ఎదుర్కొనేందుకు విద్యార్థినులు ఝాన్సీలక్ష్మీబాయిలా మనోధైర్యంతో ముందుకెళ్లాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర స్వయం సేవికా సమితి విభాగ్ కార్యావాహిక దేదీప్యశ్రీ, పాలమూరు జిల్లా కార్యావాహిక నాగిళ్ల అరుణ, రాష్ట్ర స్వయం సేవికలు లక్ష్మీ, వసంతం పద్మావతి, ఉమా, సులోచన, రాజేశ్వరితో పాటు ఉమ్మడి పాలమూరు, రంగారెడ్డి జిల్లాల కార్యకర్తలు పాల్గొన్నారు.

కృష్ణా తీరంలో సఫారీ


సోమశిల అటవీ ప్రాంతంలోని వాచ్‌టవర్ వద్దకు సఫారీ వాహనంలో వచ్చిన పర్యాటకులు

కొల్లాపూర్ అటవీశాఖ ఆధ్వర్యంలో నల్లమల, కృష్ణాతీర ప్రాంతాల్లో విహరించడానికి సఫారీ వాహనం అందుబాటులోకి వచ్చింది. బుధవారం నుంచి ఈ సేవలు అందుబాటులోకి వచ్చాయి. వాహనంలో ఒకేసారి 8 మంది ప్రయాణించవచ్చని, ఒకరికి రూ.200 టికెట్‌గా నిర్ధారించినట్లు రేంజర్ చంద్రశేఖర్ తెలిపారు. సోమశిల తీరంలోని పుష్కరఘాట్ల దగ్గర, కొల్లాపూర్‌లోని అటవీశాఖ కార్యాలయం, ఏకో పార్కు వద్ద సఫారీ వాహనం అందుబాటులో ఉంచుతామన్నారు. సోమశిల ఏకో పార్కు, అటవీప్రాంతం లోపల వాచ్ టవర్, ఎర్రకుంట తీరప్రాంతం అందాలు చూపించి తర్వాత యథాస్థానంలో దింపుతారు.

- న్యూస్‌టుడే, కొల్లాపూర్

వివాహిత అనుమానాస్పద మృతి


శాంతమ్మ

వనపర్తి న్యూటౌన్, న్యూస్‌టుడే : బావిలో పడి ఓ వివాహిత అనుమానాస్పదంగా మృతి చెందారని వనపర్తి సీఐ నాగభూషణంరావు తెలిపారు. గోపాల్‌పేట మండల ధర్మతండాకు చెందిన శాంతమ్మ (40) మంగళవారం కూరగాయలు తీసుకువస్తానని చెప్పి ఇంటి నుంచి వెళ్లారు. ఆమె కుమార్తె వసంత సాయంత్రం 6 గంటలకు తల్లికి ఫోన్ చేసి ఎక్కడున్నావని.. ఎప్పుడు వస్తావని అడిగారు. ఎనుకుంట వద్ద ఉన్నానని త్వరలో ఇంటికి వస్తానని శాంతమ్మ బదులిచ్చారు. ఆమె ఫోన్ 7.30 గంటలకు స్విచ్ఛాఫ్ అయ్యింది. వనపర్తి మండలం చిమనగుంటపల్లి గ్రామ శివారులో కావలి వెంకటయ్యకు చెందిన బోరు బావి స్టార్టర్‌ను బుధవారం గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేశారు. స్టార్టరు కోసం వెతుకుతుండగా బావి గడ్డపై చెప్పులు, చున్నీ, బావిలో చీర ఉన్నట్లు పోలీసులకు సమాచారం ఇచ్చారు. విషయం తెలిసి శాంతమ్మ భర్త బద్రు, కుమారుడు గణేశ్, కుమార్తె వచ్చి చీర, చెప్పులను చూసి గుర్తు పట్టారు. ఎస్పీ రావుల గిరిధర్, డీఎస్పీ వెంకటేశ్వరరావు, సీఐ నాగభూషణం, ఎస్సై జలేందర్‌రెడ్డి సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. క్లూస్‌టీం సిబ్బంది వేలిముద్రలు సేకరించారు. డాగ్‌స్క్వాడ్ బృందం వెంట వచ్చిన శునకం చెన్నూరు శివారులోని రైస్‌మిల్లు వద్దకు వెళ్లి ఆగింది. వివాహిత మృతదేహాన్ని పోలీసులు శవపరీక్ష నిమిత్తం వనపర్తి ఆసుపత్రికి తరలించారు. కుమారుడు గణేశ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. బావిలో నాగర్‌కర్నూల్ జిల్లా పెంట్లవెల్లికి చెందిన బి.ప్రభాకర్ ఆధార్ కార్డు, డ్రైవింగ్ లైసెన్సు లభించిందని, త్వరలో నిందితుడిని పట్టుకుంటామని సీఐ తెలిపారు. పోలీసులు ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.

చికెన్ ధరలు

ఫాంరేటు	114-00
రిటైల్	136-00
డ్రెస్డ్	197-00
స్కిన్‌లెస్	224-00

అచ్చంపేట ఎస్సైగా రమేష్

అచ్చంపేట న్యూటౌన్, న్యూస్‌టుడే : అచ్చంపేట ఎస్సైగా రమేష్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేసిన ఎస్సై రాము నారాయణపేటకు బదిలీపై వెళ్లారు. అమ్రాబాద్ ఎస్సైగా పని చేసిన రమేష్ ఇక్కడికొచ్చారు.

చెంచుపెంటల్లో వైద్య శిబిరాలు

మన్ననూరు(అమ్రాబాద్), న్యూస్‌టుడే : నల్లమల లోతట్టు అటవీ ప్రాంతంలో బుధవారం వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. ప్రోగ్రాం అధికారి డా.శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఈర్లపెంట, సంగడిగుండల, మేడిమల్కల, భౌరాపూర్ చెంచుపెంటల్లో చెంచులకు వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వట్వర్లపల్లి వైద్యాధికారి డా.అభిలాశ్, డా.గౌతం, డా.శివశంకర్, హెల్త్ అసిస్టెంట్ లోక్యానాయక్, రాజేష్, సరోజ పాల్గొన్నారు.

కొలువానందం..


ముఖ్యమంత్రి చేతుల మీదుగా నియామక పత్రం అందుకుంటున్న మనోజ్‌కుమార్

పెద్దకొత్తపల్లి, న్యూస్‌టుడే : మండలంలోని చెన్నపురావుపల్లికి చెందిన మనోజ్‌కుమార్ స్కూల్ అసిస్టెంటుగా (సాంఘిక శాస్త్రం) జిల్లా 3వ ర్యాంకు సాధించారు. బుధవారం హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా నియామక పత్రం అందుకున్నారు. జిల్లాకు చెందిన 210 మంది అభ్యర్థులు నియామక పత్రాలు అందుకున్నట్లు డీఈవో గోవిందరాజులు తెలిపారు.

మూడు ఉద్యోగాలు సాధించిన యువకుడు


తాండ్ర అజయ్‌కుమార్

వెల్దండ గ్రామీణం, న్యూస్‌టుడే : వెల్దండ మండలం చొక్కన్నపల్లి గ్రామానికి చెందిన తాండ్ర అజయ్‌కుమార్ మూడు ఉద్యోగాలు సాధించారు. రేషన్ డీలర్ రాములమ్మ, జంగయ్యల కుమారుడు ఈయన. ఎల్ఎల్‌బీ పూర్తి చేసి హైదరాబాద్‌లో యూపీఎస్ఈలో శిక్షణ తీసుకుంటూనే 2023లో కోర్టులో జూనియర్ అసిస్టెంట్‌గా ఎంపికయ్యారు. ఆరు నెలలుగా నాగర్‌కర్నూల్‌లోని సీనియర్ సివిల్ కోర్టులో విధులు నిర్వర్తిస్తున్నారు. గ్రూప్-4 ఫలితాల్లో జిల్లాలో 10వ ర్యాంకు సాధించారు. డీఎస్సీ ఫలితాల్లో ఎస్జీటీగా ఎంపికయ్యారు. గ్రూప్-1 ప్రిలిమ్స్‌లో మెయిన్స్‌కు అర్హత సాధించారు.

రెండు ఉద్యోగాలకు ఎంపిక


డీఈవో గోవిందరాజులు చేతుల మీదుగా నియామక పత్రం అందుకుంటున్న శివయ్య

అచ్చంపేట, న్యూస్‌టుడే : ఊర్కొండ మండలం మాదారం గ్రామానికి చెందిన శివయ్య రెండు ఉద్యోగాలు సాధించారు. తల్లిదండ్రులు దుర్గమ్మ, బాలకిష్టయ్య వ్యవసాయం చేస్తుంటారు. ఎంఏ, బీఈడీ పూర్తి చేసి 2017లో టీఆర్టీలో కొద్ది మార్కుల తేడాతో అవకాశం కోల్పోయారు. గురుకుల విద్యాలయంలో సాంఘిక శాస్త్రం ఉపాధ్యాయుడిగా, ప్రస్తుత డీఎస్సీ ఫలితాల్లో జిల్లాలో 33వ ర్యాంకు సాధించి స్కూల్ అసిస్టెంట్ (సాంఘికశాస్త్రం)గా ఎంపికయ్యారు. ప్రణాళికతో చదవడంతో పాటు ఆన్‌లైన్‌లో సమాచారాన్ని సేకరించి నోట్స్ తయారు చేసుకున్నట్లు శివయ్య తెలిపారు. డీఎస్సీ ద్వారా సాధించిన ఎస్ఏ పోస్టును ఎంపిక చేసుకున్నానని చెప్పారు.

వర్గీకరణ అమలు చేయకుంటే అన్యాయం



నాగర్‌కర్నూల్ : పట్టణంలోని కలెక్టరేట్ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

కందనూలు, న్యూస్‌టుడే : వర్గీకరణ అమలు చేయకుండా ఉద్యోగాలు భర్తీ చేస్తే మాదిగ నిరుద్యోగ యువతకు తీవ్ర అన్యాయం జరుగుతుందని ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ కాశీం ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్సీ వర్గీకరణ పూర్తి స్థాయిలో అమలు చేసే వరకు రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగాల నియామకాల ప్రక్రియ నిలిపివేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలోని కలెక్టరేట్ వద్ద నిరసన వ్యక్తం చేసి మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలని దేశ అత్యున్నత న్యాయస్థానం తీర్పు ఇచ్చిన రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయకుండా ఉద్యోగాలు భర్తీ చేయడం సరైన విధానం కాదన్నారు. వెంటనే రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పందించాలన్నారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కలెక్టరేట్‌లో జిల్లా పాలనాధికారి బాదావత్ సంతోష్‌కు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు గూట విజయ్, దశరథం, యాదగిరి, మహేశ్, కిరణ్, కృష్ణయ్య, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులతో లాభాలు

కోడేరు, న్యూస్‌టుడే : యాజమాన్య పద్ధతులతో ఆయిల్ పాం పంట సాగు చేస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే) పాలెం ఉద్యాన శాస్త్రవేత్త డా.ఆదిశంకర్ అన్నారు. బుధవారం మండలంలోని జనుంపల్లి రైతువేదికలో ఉద్యాన-పట్టుపరిశ్రమ శాఖ ఆధ్వర్యంలో లేత ఆయిల్‌పాం తోటలు, యాజమాన్య పద్ధతులపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆయిల్‌పాం పంటతో 30 ఏళ్ల వరకు స్థిరమైన ఆదాయం వస్తుందన్నారు. కొల్లాపూర్ డివిజన్ ఉద్యాన శాఖ అధికారి లక్ష్మణ్ మాట్లాడుతూ.. మధ్యవర్తిత్వం లేకుండా ప్రభుత్వం నిర్ణయించిన ధరకు కొనుగోలు చేస్తారని చెప్పారు. 2024-25లో జిల్లాలో 2,800 ఎకరాల్లో పంట సాగు లక్ష్యం ఉండగా.. ఇప్పటి వరకు 1,458 మంది 6,573 ఎకరాల్లో సాగు చేశారన్నారు. ఎస్సీ, ఎస్టీలకు వంద శాతం, చిన్న, సన్నకారు రైతులకు 90శాతం, అయిదు ఎకరాలు పైబడిన రైతులకు 80శాతం రాయితీ ఉంటుందన్నారు. ప్రియునిక్ ఏరియా మేనేజర్ రాకేష్, అజయ్, చంద్రశేఖర్, గోవర్ధన్ పాల్గొన్నారు.

కనుల పండువగా నవరాత్రి ఉత్సవాలు


అచ్చంపేట: వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో ఒడి బియ్యం సమర్పిస్తున్న ఆర్యవైశ్య మహిళలు


అచ్చంపేట: మార్కండేయ శివాలయంలో సీబీఎం ట్రస్ట్ ఛైర్‌పర్సన్ అనురాధ


కోడేరు : నర్సాయిపల్లిలో తొమ్మిది అవతారాల్లో...


కొల్లాపూర్‌లో..

జిల్లా వ్యాప్తంగా శరన్నవరాత్రి ఉత్సవాలు బుధవారం ఘనంగా జరిగాయి. కల్వకుర్తిలోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారిని సరస్వతీదేవిగా అలంకరించారు. మహిళలు సామూహిక ఒడిబియ్యం కార్యక్రమాన్ని నిర్వహించారు. వేడుకల్లో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు లక్ష్మీనారాయణ, వైశ్య కార్పొరేషన్ అధ్యక్షురాలు కాల్వ సుజాత, కాలుష్య నియంత్రణ మండలి సభ్యుడు బాలాజీ సింగ్, పుర అధ్యక్షుడు ఎడ్మసత్యం, ఆలయకమిటీ అధ్యక్షుడు రమేష్‌బాబు పూజలు చేశారు. అచ్చంపేట మండలం ఉమామహేశ్వర క్షేత్రంలో మూలవిరాట్టు ఉమాదేవిని కాళరాత్రి దేవిగా అలంకరించారు. మార్కండేయ శివాలయంలో సీబీఎం ట్రస్ట్ ఛైర్‌పర్సన్ డా.అనురాధ పూజలు చేశారు. కన్యకా పరమేశ్వరీ దేవాలయం, భ్రమరాంబ దేవాలయంలో అమ్మవారికి ఒడి బియ్యం పోశారు. అంజనీమాత సేవా సమితి ఆధ్వర్యంలో చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం చేయించి, ఉపాధ్యాయులను సన్మానించారు. కొల్లాపూర్‌లో మంత్రి జూపల్లి కృష్ణారావు సతీమణి సుజనమ్మ, కొల్లాపూర్ పురపాలక అధ్యక్షురాలు మేకల రమ్యకుమారి బతుకమ్మ వేశారు. కన్యకా పరమేశ్వరీ ఆలయంలో, వరిదేల శమీవృక్షం వద్ద అమ్మవారిని సరస్వతీదేవిగా అలంకరించారు.

– న్యూస్‌టుడే బృందం


అచ్చంపేట: వాసవీ కన్యకా పరమేశ్వరీ ఆలయంలో...


నాగర్‌కర్నూల్ : రాఘవేంద్రకాలనీలో..


అమ్రాబాద్‌లో సరస్వతీదేవి రూపంలో...


కల్వకుర్తిలో..


మంత్రి జూపల్లి కృష్ణారావు క్యాంపు కార్యాలయంలో ఆయన సతీమణి సుజనమ్మ

చేప పిల్లలు వదిలిన ఎమ్మెల్యే

అచ్చంపేట న్యూటౌన్, న్యూస్‌టుడే : చేపల పెంపకంతో మత్స్యకారులు ఆర్థికాభివృద్ధి సాధించాలని ఎమ్మెల్యే వంశీకృష్ణ సూచించారు. బుధవారం మండలంలోని చంద్రసాగర్ చెరువులో అధికారులతో కలిసి 2 లక్షల చేప పిల్లలు వదిలారు. జిల్లా మత్స్యశాఖ ఏడీ రజినీ, జిల్లా గ్రంథాలయ ఛైర్మన్ రాజేందర్, ఉమామహేశ్వర దేవస్థాన ఛైర్మన్ మాధవరెడ్డి, నేతలు సీఎంరెడ్డి, గోపాల్‌రెడ్డి, వెంకటయ్య, రామనాథం పాల్గొన్నారు.


చెరువులో చేప పిల్లల్ని వదులుతున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

ఉప్పునుంతల, న్యూస్‌టుడే : కాంసానిపల్లిలోని మర్యాద చెరువు, లక్ష్మాపూర్ వెంకటేశ్వర చెరువులో బుధవారం ఎమ్మెల్యే డా.వంశీకృష్ణ చేపపిల్లలను వదిలారు. అంతకు ముందు ఆయన శ్రీశైలం - హైదరాబాద్ ప్రధాన రహదారిపై ఉన్న రాయిచేడ్‌లో ఇంటిగ్రేటెడ్ గురుకుల పాఠశాల ఏర్పాటుకు ప్రభుత్వ స్థలాన్ని పరిశీలించారు. అచ్చంపేట మండలం చంద్రసాగర్ వద్ద చేపల పెంపకం కేంద్రాన్ని ఏర్పాటు చేయిస్తామన్నారు. డిండి చెరువు వద్ద టూరిజం హబ్‌గా మార్చుతామన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో మాధవి, జిల్లా మత్స్యశాఖ ఏడీ రజిత, రహదారులు, భవనాల శాఖ డీఈ జలంధర్, జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ రాజేందర్, మార్కెట్ వైస్ ఛైర్మన్ వెంకటయ్య, నాయకులు ప్రతాప్‌రెడ్డి, కట్టా అనంతరెడ్డి, టి.నర్సింహారెడ్డి, మల్లేష్, నర్సింహారావు, లక్ష్మీనారాయణ, శేఖర్‌రెడ్డి, మత్స్యకార్మిక సంఘం నాయకులు పాల్గొన్నారు.

మొక్కజొన్న క్వింటా గరిష్ఠ ధర రూ.2,382

అచ్చంపేట, న్యూస్‌టుడే : అచ్చంపేట వ్యవసాయ మార్కెట్‌లో బుధవారం మొక్కజొన్న క్రయ విక్రయాలు నిర్వహించారు. 20 మంది 898 క్వింటాళ్ల (449 బస్తాలు) మొక్కజొన్న ధాన్యం మార్కెట్‌కు తెచ్చారు. క్వింటా గరిష్ఠ ధర రూ. 2,382, మాదిరి ధర రూ. 2,243, కనిష్ఠ ధర రూ. 1,769 చొప్పున వ్యాపారులు కొనుగోలు చేశారు. ఆముదాలు క్వింటా రూ. 5,603గా కొనుగోలు చేశారు. మద్దతు ధర అందేలా చూస్తామని మార్కెట్ ఛైర్‌పర్సన్ రజిత తెలిపారు.

క్రీడా కోటా ఎంపికలపై అభ్యంతరం

కందనూలు, న్యూస్‌టుడే : డీఎస్సీ 2024 ప్రక్రియలో భాగంగా జిల్లా విద్యాశాఖ అధికారులు క్రీడా కోటా అభ్యర్థుల ఎంపిక విషయంలో అనర్హులకు కేటాయించినట్లు ఉన్నతాధికారులు విచారణ నిర్వహించాలని బాధితులు కోరారు. బుధవారం పట్టణంలోని కలెక్టరేట్‌లో బాధితులు అశోక్, అరవింద్ తదితరులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. విద్యాశాఖ అధికారులు 1:3 నిష్పత్తి ప్రకారం అభ్యర్థుల ధ్రువ పత్రాలు పరిశీలించి 1:1 జాబితా ప్రకటించారు. ఈ జాబితాలో కౌన్సిలింగ్‌లో రాని అభ్యర్థులను సైతం ఎంపిక చేశారని ఆరోపించారు. దీని వలన ఆరుగురు అభ్యర్థులకు అన్యాయం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. డీఈవో గోవిందరాజులును వివరణ కోరగా రాష్ట్ర ఉన్నతాధికారులు జారీ చేసిన నిబంధనల ప్రకారం జాబితా రూపొందించామని ఎలాంటి పొరపాటు జరగలేదని పేర్కొన్నారు.

అవినీతి అధికారులపై చర్యలు తీసుకోవాలి

కందనూలు, న్యూస్‌టుడే : పట్టణంలోని పురపాలక సంఘం కార్యాలయంలో పారిశుద్ధ్య కార్మికుల వేతనాల పేరుతో రూ. కోటి అవినీతికి పాల్పడిన అధికారులపై చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఆర్. శ్రీనివాసులు డిమాండ్ చేశారు. పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద బుధవారం ఆ పార్టీ నాయకులు నిరసన వ్యక్తం చేసి మాట్లాడారు. 2020 నుంచి వేతనాల పేరుతో అవినీతికి పాల్పడుతున్నా.. ఉన్నతాధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. కలెక్టర్ స్పందించి సమగ్ర విచారణ నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు కందికొండ గీత, పొదిల రామయ్య, అశోక్, యాదయ్య, కాశన్న, సత్యనారాయణ, సురేష్, మధు తదితరులు పాల్గొన్నారు.



నాగర్‌కర్నూల్ : అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

ఘనంగా కాన్షీరాం వర్ధంతి


మాట్లాడుతున్న డీఎస్పీ జిల్లా అధ్యక్షుడు సాయి మహరాజ్

వెల్దండ గ్రామీణం, న్యూస్‌టుడే : పెద్దాపూర్ గ్రామంలో అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో కాన్షీరాం వర్ధంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆయన చిత్రపటాన్ని ఉంచి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆయన సేవలను కొనియాడారు. యువజన సంఘం సభ్యులు మహేశ్, సుధాకర్, వెంకటేశ్, కిరణ్, సూర్యం, నవీన్, వంశీ, పవన్, దినేశ్, సందీప్ పాల్గొన్నారు.

అచ్చంపేట టౌన్, న్యూస్‌టుడే : ధర్మ సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు సాయి మహరాజ్ ఆధ్వర్యంలో పట్టణంలోని అంబేడ్కర్ కూడలిలో బుధవారం కాన్షీరామ్ వర్ధంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నేతలు విష్ణు, శ్రీధర్, భాస్కర్, శేఖర్, వీరయ్య, రాజు పాల్గొన్నారు.

కందనూలు, న్యూస్‌టుడే : రాష్ట్రంలోని బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలకు చెందిన బహుజనులు కలిసి రాజ్యాధికారం చేపట్టాలని బీఎస్పీ అసెంబ్లీ ఇన్‌ఛార్జి కొత్తపల్లి కుమార్ అన్నారు. పట్టణంలోని ఓ ప్రైవేట్ సమావేశ మందిరంలో బుధవారం కాన్షీరాం వర్ధంతి సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ నాయకులు పట్టణంలోని ప్రధాన రహదారి పై ర్యాలీ నిర్వహించి అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆయన చిత్రపటానికి నివాళి అర్పించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నాయకులు రాంచందర్, పృథ్వీరాజ్, కల్యాణ్, నాగేశ్, మల్లయ్య, కృపానందం తదితరులు పాల్గొన్నారు.


నాగర్‌కర్నూల్: నివాళి అర్పిస్తున్న నాయకులు

కల్వకుర్తి, న్యూస్‌టుడే : దేశంలో బహుజన రాజ్యస్థాపనకు కృషి చేసిన కాన్షీరాం ఆశయాలను నెరవేర్చుదామని బీఎస్పీ నాయకులు అన్నారు. ఆయన వర్ధంతి సందర్భంగా బుధవారం తాండ్ర అంబేడ్కర్ చౌరస్తాలో కాన్షీరాం చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళి అర్పించారు. కల్వకుర్తి నియోజకవర్గం బీఎస్పీ బాధ్యులు ఆంజనేయులు, నాయకులు మల్లేశ్, పర్వతాలు, దాసరిచంటి, మల్లేశ్, దిలీప్, అనిల్, అజయ్ పాల్గొన్నారు.

రైతు భరోసా డబ్బులు విడుదల చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి పర్వతాలు

బల్మూర్ (అచ్చంపేట న్యూటౌన్), న్యూస్‌టుడే : రైతు భరోసా డబ్బులను వెంటనే విడుదల చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి పర్వతాలు డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ విధానాలకు నిరసనగా రైతులు ఆందోళనకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. దేశ్యానాయక్, శంకర్‌నాయక్, లాల్‌హైమద్, మహేందర్, ఆంజనేయులు పాల్గొన్నారు.

రాష్ట్ర పీఆర్టీయూ కార్యవర్గంలో చోటు

కల్వకుర్తి, న్యూస్‌టుడే : రాష్ట్ర పీఆర్టీయూ కార్యవర్గంలో కల్వకుర్తి ప్రాంతంలో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు చోటు దక్కింది. జంపుల శ్రీనివాసులు(తర్నికల్), మాణిక్యరెడ్డి(కల్వకుర్తి) ఉపాధ్యక్షులుగా, రాజ్యలత(తాండ్ర) మహిళా విభాగం ఉపాధ్యక్షురాలిగా, శాయిని శ్రీనివాసులు(మార్చాల) కార్యదర్శిగా ఎంపికయ్యారు.

సురక్షిత మాతృత్వమే లక్ష్యంగా సేవలు

కందనూలు, న్యూస్‌టుడే : ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రతి గర్భిణీ సురక్షిత మాతృత్వాన్ని పొందడానికి ప్రతి ఒక్కరు అంకితభావంతో పని చేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. స్వరాజ్యలక్ష్మి సూచించారు. పట్టణంలోని కలెక్టరేట్ సముదాయంలోని జిల్లా వైద్యారోగ్యశాఖ కార్యాలయంలో బుధవారం సూపర్‌వైజర్లు, ఆశ కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. గర్భిణుల ఆరోగ్యంపై వైద్య సిబ్బంది దృష్టి సారించాలన్నారు. గర్భిణులకు వైద్య సేవలు అందించే విషయంలో 102 అత్యవసర వాహనం ఉపయోగించుకోవాలన్నారు. 3, 4 వారాల గర్భిణులకు వైద్య పరీక్షలు తప్పనిసరిగా చేయించాలన్నారు. సమావేశంలో ప్రోగ్రాం అధికారి డా. లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్తు సరఫరాలో అంతరాయం

లింగాల, న్యూస్‌టుడే : మండల కేంద్రంలో వీధి దీపాలు అమరుస్తున్నందున గురువారం ఉదయం 8 నుంచి 10 గంటల వరకు విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ అప్పలనాయుడు బుధవారం తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

తెరపై ఈనాడు

నాగర్‌కర్నూల్‌లో.. రవి : **దేవర.** రమణ : **స్వాగ్**
కల్వకుర్తిలో.. పార్థసారధి : **దేవర.** అశోక్ : **స్వాగ్**

కూరగాయల ధరలు కిలో... రూ.లలో



కందనూలు, న్యూస్‌టుడే : టమాటా 75, వంకాయ 50, బెండ 45, మిరప 60, కాకర 65, బీర 65, క్యాలిఫ్లవర్ 70, క్యాబేజీ 45, క్యారెట్ 65, దొండ 50, ఆలుగడ్డ 48, గోకర 65, దోస 45, ఆనంకాయ 18, చిక్కుడు 60, మునగకాయ 75, బీట్‌రూట్ 60, ఖీర, 45, బీన్స్ 95.

ఉత్సాహంగా క్రికెట్ టోర్నీ


నిరంజన్

అచ్చంపేట టౌన్, న్యూస్‌టుడే : పట్టణ కేంద్రంలోని ఎన్టీఆర్ క్రీడా మైదానంలో తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ (టీసీఏ) ఆధ్వర్యంలో క్రికెట్ పోటీలు కొనసాగుతున్నాయి. బుధవారం అచ్చంపేట జట్టుపై నాగర్‌కర్నూల్ జట్టు 14 పరుగుల తేడాతో విజయం సాధించింది. నిరంజన్ 115 బంతుల్లో 19 ఫోర్లు, 5 సిక్స్‌లతో 144 పరుగులు చేసి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అందుకున్నాడు. టీసీఏ ఇన్‌ఛార్జి ఎంఎన్ గౌడ్, రమేష్ గౌడ్, సోహెల్ పాల్గొన్నారు.

పోటీలు ప్రారంభం

వెల్దండ గ్రామీణం, న్యూస్‌టుడే : వెల్దండ మండలం కుప్పగండ్ల, అజిలాపూర్ గ్రామాల్లో దసరా పండగ సందర్భంగా బుధవారం క్రికెట్ ప్రీమియర్ లీగ్ పోటీలు ప్రారంభమయ్యాయి. మాజీ సర్పంచ్‌లు మట్టశారదమ్మ, శేఖర్‌ముదిరాజ్, నాయకులు వెంకట్‌రెడ్డి, అశోక్‌తేజ, రమేష్‌గౌడ్ పాల్గొన్నారు.


క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న నిర్వాహకులు

మహిళ మృతిపై కేసు.. లింగాల, న్యూస్‌టుడే : మండల కేంద్రంలో మంగళవారం రాత్రి మృతిచెందిన గుర్తు తెలియని మహిళ మృతిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై జగన్మోహన్ బుధవారం తెలిపారు. దాదాపు 50ఏళ్ల వయస్సున్న మహిళ మృతదేహంపై నీలిరంగు జాకెట్, నలుపు, తెలుపు రంగు దుప్పటి ఉన్నట్లు చెప్పారు. అచ్చంపేట ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీలో ఉంచినట్లు వివరించారు.

ఆసుపత్రి సిబ్బంది దాడిపై విచారణ.. అచ్చంపేట న్యూటౌన్, న్యూస్‌టుడే : పట్టణంలోని ఓ ప్రయివేటు ఆసుపత్రి సిబ్బంది డబ్బుల కోసం మహిళపై దాడికి పాల్పడిన ఘటనలో వైద్యఆరోగ్య శాఖ అధికారులు స్పందించారు. బుధవారం ఉప వైద్యాధికారి తారాసింగ్ ఆసుపత్రిని సందర్శించి వివరాలు సేకరించారు. బాధిత రోగి, మరో మహిళ అనారోగ్యానికి గురైతే తరచూ ఇదే ఆసుపత్రికి వస్తుంటారని, రూ.500 ఇవ్వనందున వాగ్వాదం జరిగినట్లు గుర్తించామన్నారు. పూర్తి విచారణ అనంతరం ఉన్నతాధికారులకు నివేదికను అందజేయనున్నట్లు చెప్పారు.

అత్యాచార యత్నం.. వ్యక్తిపై కేసు నమోదు.. బిజినేపల్లి, న్యూస్‌టుడే : మహిళతో అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై నాగశేఖర్‌రెడ్డి తెలిపారు. వెల్గొండకు చెందిన ఓ మహిళ ఈనెల 2న కూలీ పనులకు బయలుదేరింది. అదే గ్రామానికి తిరుపాల్ గ్రామ శివారులో ఆమెను అడ్డగించి అత్యాచార యత్నం చేశాడు. బలవంతంగా ఆమె మెడలోని రెండు తులాల బంగారు నగలు లాక్కున్నాడు. ఇదే విషయమై ఈ నెల 4న బాధిత మహిళ బిజినేపల్లి ఠాణాలో ఫిర్యాదు చేసింది. విచారణ చేసి నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు బుధవారం ఎస్సై తెలిపారు.

వేర్వేరు ప్రమాదాల్లో నలుగురికి గాయాలు.. బిజినేపల్లి, న్యూస్‌టుడే : ద్విచక్రవాహనం అదుపుతప్పి ఓ వ్యక్తికి తీవ్ర గాయాలైన సంఘటన బిజినేపల్లి మండల కేంద్రంలో బుధవారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. నందివడ్డెమాన్ గ్రామానికి చెందిన యువకుడు రామకృష్ణ ద్విచక్రవాహనంపై నాగర్‌కర్నూల్ వైపు వెళ్తున్నాడు. పాలెం సమీపంలోకి రాగానే ఉదయం నడకకు వెళ్తున్న వారిని తప్పించే క్రమంలో అదుపుతప్పి కిందపడ్డాడు. స్థానికులు గమనించి 108 వాహనంలో నాగర్‌కర్నూల్ జనరల్ ఆసుపత్రికి తరలించారు.

ఊర్కొండ, న్యూస్‌టుడే : రోడ్డు ప్రమాదంలో వ్యక్తి గాయపడిన ఘటన బుధవారం మండల కేంద్రంలో చోటు చేసుకుంది. ఏఎస్సై నర్సింహులు కథనం ప్రకారం.. కల్వకుర్తి మండలం జిల్లెల్ల గ్రామానికి చెందిన సాయిలు ద్విచక్ర వాహనంపై ఊర్కొండకు వచ్చి తిరిగి వెళ్తున్నాడు. 167వ జాతీయ రహదారి పెట్రోల్ పంపు సమీపంలో నల్గొండ జిల్లా నకిరేకల్‌కు చెందిన దామోదర్‌రెడ్డి కారులో జడ్చర్ల నుంచి కోదాడ వైపు వెళ్తూ అతివేగంగా ద్విచక్ర వాహనాన్ని వెనుక ఢీకొట్టాడు. ద్విచక్ర వాహనంపై ఉన్న సాయిలు గాయపడ్డాడు. గమనించిన స్థానికులు 108 వాహనంలో కల్వకుర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్లు ఏఎస్సై నర్సింహులు తెలిపారు.

కారు ఢీకొని ఇద్దరికి గాయాలు.. బల్మూర్ (అచ్చంపేట న్యూటౌన్), న్యూస్‌టుడే : కారు ఢీకొని ఇద్దరికి తీవ్ర గాయాలైన సంఘటన మండలంలోని మైలారం గేటు సమీపంలో బుధవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం... బల్మూర్ మండల కేంద్రానికి చెందిన అభిలాశ్, అన్వర్ కలిసి ద్విచక్ర వాహనంపై అచ్చంపేట వైపు వెళ్తున్నారు. అదే సమయంలో అచ్చంపేట నుంచి బల్మూర్ వైపు వస్తున్న కారు వీరిని ఢీకొంది. అన్వర్, అభిలాశ్ల కాలు, చేతులకు తీవ్ర గాయాలు కాగా స్థానికులు అచ్చంపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం హైదరాబాద్ తరలించినట్లు వైద్యులు చెప్పారు. కారును పోలీసులు ఠాణాకు తరలించారు.

రేషన్ బియ్యం స్వాధీనం.. కొల్లాపూర్, కొల్లాపూర్ పట్టణం, న్యూస్‌టుడే : అక్రమంగా తరలిస్తున్న 6 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టుకున్నారు. కొల్లాపూర్ ఎస్సై హృషికేశ్ కథనం ప్రకారం...ముక్కిడిగుండం గ్రామం నుంచి కొల్లాపూర్‌లోని ఓ మిల్లుకు 6 క్వింటాళ్ల రేషన్ బియ్యం వాహనంలో తరలిస్తుండగా చుక్కాయిపల్లి శివారులో పోలీసులు పట్టుకున్నారు. వ్యాపారి కేశవులుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నాం. రెవెన్యూ ఆర్ఐ జానయ్య సమక్షంలో పంచనామా చేసి బియ్యం గోదాంకు తరలించారు.

కల్వకుర్తిపట్టణం, న్యూస్‌టుడే : అక్రమంగా రేషన్ బియ్యం రవాణా చేస్తున్న వాహనాన్ని జప్తుచేసి కేసు నమోదు చేసినట్లు ఎస్సై మాధవరెడ్డి తెలిపారు. బుధవారం పట్టణ శివారులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ రాఘవేందర్‌రెడ్డితో కలిసి వాహనాల తనిఖీలు చేయగా వెల్దండ వైపు నుంచి కల్వకుర్తి మీదుగా నాగర్‌కర్నూల్ వైపు వెళ్తున్న బొలెరో వాహనంలో 21 క్వింటాళ్ల బియ్యాన్ని గుర్తించడంతో వాహనాన్ని జప్తుచేసి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత.. ఉప్పునుంతల, న్యూస్‌టుడే : దుందుభి వాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను బ్లూకోర్ట్సు పోలీసులు బుధవారం పట్టుకున్నారు. వెల్టూరు గేట్ వద్ద ట్రాక్టర్‌ను పట్టుకొని ఠాణాకు తరలించారన్నారు. కాంసానిపల్లికి చెందిన ట్రాక్టర్ యజమాని కె.సత్యనారాయణపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై లెనిన్ తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత.. బల్మూర్ (అచ్చంపేట న్యూటౌన్), న్యూస్‌టుడే : అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను పట్టుకున్నట్లు ఎస్సై గురుస్వామి తెలిపారు. బుధవారం మండలంలోని చెన్నారం వైపు నుంచి ఒక ట్రాక్టర్ గోదల్ వైపు, మరో ట్రాక్టర్ కొండారెడ్డిపల్లి వైపు ఇసుకతో వెళ్తుండగా పరిశీలించి స్వాధీనం చేసుకొని ఠాణాకు తరలించారని చెప్పారు. ఇద్దరు డ్రైవర్లు మల్లేష్, భాస్కర్‌పై కేసు నమోదు చేసినట్లు వివరించారు.

మందపైకి కారు.. 15 గొర్రెలు మృత్యువాత.. అచ్చంపేట గ్రామీణం, న్యూస్‌టుడే : ఓ కారు గొర్రెల మందపై నుంచి దూసుకుపోవడంతో 15 గొర్రెలు మృత్యువాత పడ్డాయి. ఈ సంఘటన మండలంలోని బ్రాహ్మణపల్లి సమీపంలో శ్రీశైలం ప్రధాన రహదారిపై బుధవారం చోటు చేసుకుంది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం... బ్రాహ్మణపల్లికి చెందిన పలువరాణి శ్రీశైలం యాదవ్ తన గొర్రెలను చందాపూర్ సమపంలో మేపుకొని సాయంత్రం తిరిగి వస్తున్నారు. అదే సమయంలో షాద్‌నగర్ ప్రాంతానికి చెందిన వారు కారులో శ్రీశైలం వెళ్తున్నారు. వేగంగా ఉన్న కారు అదుపు తప్పి మందపైకి దూసుకెళ్లడంతో 15 గొర్రెలు అక్కడికక్కడే మృతి చెందాయి. వీటి విలువ దాదాపు రూ.లక్షన్నర ఉంటుందని బాధితుడు తెలిపారు.

ఇంట్లో చోరీ.. కొల్లాపూర్ పట్టణం, న్యూస్‌టుడే : పట్టణంలోని కన్యకా పరమేశ్వరీ ఆలయ సమీపంలోని ఓ ఇంట్లో చోరీ జరిగింది. ఎస్సై హృషికేశ్ కథనం ప్రకారం.. పట్టణానికి చెందిన కె.ఎస్ పరిదొద్దిన్ కుటుంబ సభ్యులతో కలిసి ఈనెల 4న హైదరాబాద్ వెళ్లారు. బుధవారం వచ్చి చూడగా ఇంట్లో ఉన్న కొంత బంగారం, వెండి చోరీ జరిగిందని గుర్తించారు. పరిదొద్దిన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

క్రీడా ఆణిముత్యాలు వెలికితీయాలి

చారకొండ (వెల్దండ గ్రామీణం), న్యూస్‌టుడే: గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడా ఆణిముత్యాలు ఎంతో మంది ఉంటారని వారిని వెలికితీయాలని వెల్దండ ఉమ్మడి మండల సింగిల్‌విండో ఛైర్మన్ భాస్కర్‌రావు కోరారు. బుధవారం చారకొండ మండలం జూపల్లిలో దసర పండుగ సందర్భంగా డివిజన్ స్థాయి వాలీబాల్ పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లోనే మెరికలైన క్రీడాకారులు ఎంతో మంది ఉంటారని, వారిని ప్రోత్సహించాలన్నారు. మాజీ సర్పంచి సాయికుమార్, నాయకులు పరంజ్యోతి, రాములుయాదవ్, ఎండీ సీరాజ్, వెంకటేశ్, ఇర్ఫాన్, నరేశ్, ఇమ్రాన్ పాల్గొన్నారు.


క్రీడా కారులను పరిచాయం చేసుకుంటున్న సింగిల్‌విండో ఛైర్మన్ భాస్కర్‌రావు

ఆర్థిక సాయం అందజేత

వంగూరు, న్యూస్‌టుడే : వంగూరు మండలం ఎల్లమ్మ రంగాపూర్ గ్రామంలో ఇటీవల మృతి చెందిన బొల్లె హుస్సేన్ కుటుంబానికి ఎమ్మెల్యే వంశీకృష్ణ ఆదేశాల మేరకు యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లయ్య బుధవారం రూ.10వేలు అందించారు. కార్యక్రమంలో శ్రీను, రాజుపటేల్, అమీర్, విష్ణు, పాండు, పర్వతాలు, బాలకృష్ణ, శివరాజు తదితరులు పాల్గొన్నారు.